క్లుప్తంగా

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



భిక్కనూరు : వరి పంటకు కాండం తొలుచు పురుగు ఆశిస్తోందని నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని కామారెడ్డి ఏడీఏ అపర్ణ సూచించారు. శనివారం ఆమె ఏవో రాధతో కలిసి భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామంలోని వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకారానికి 40 గ్రాముల చొప్పున పిచికారి చేయాలన్నారు.

బోర్లు ఎత్తిపోతున్నాయ్..



రామారెడ్డి : వేసవి కాలం ప్రారంభానికి ముందే బోర్లు ఎత్తిపోస్తున్నాయి. రామారెడ్డి మండల ప్రధానంగా బోరు బావులపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న రైతులు బోర్లు బావులు ఎత్తిపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. మండలవ్యాప్తంగా ప్రధానంగా ఖరీఫ్, రబీ సీజన్లలో వరి సాగు ఎక్కువగా చేస్తారు. బోరు బావులు ఎత్తిపోతుండడంతో చివరి మడి వరకు నీళ్లు అందక వరి పంట బీటలు పారి ఎండిపోతున్నాయి.

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ బర్త్‌డే



నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ బర్త్‌డేను బీఆర్‌ఎస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆమె నివాసంలో కేక్ కట్ చేశారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో గున్కుల్ సొసైటీ చైర్మన్ వాజిద్ అలీ, నాయకులు విజయ్, మహేందర్, నరేశ్, సాయాగౌడ్, మిడుత సాయిలు తదితరులు ఉన్నారు.

కళాశాల స్థలాన్ని కాపాడాలి



భిక్కనూరు : మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జాచేశారని ఏబీవీపీ నేతలు శనివారం భిక్కనూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. రియల్టర్లు తమ వెంచర్ కడ్డీలను జూనియర్ కళాశాల స్థలంలో పాతారని అధికారులు స్పందించి కళాశాల స్థలాన్ని కాపాడాలని పేర్కొంటూ డిప్యూటీ తహసీల్దార్ రోజాకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంధం సంజయ్, నేతలు శివ, రాజేందర్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం



దోమకొండ : దోమకొండ గడికోట ట్రస్ట్ ద్వారా గ్రామంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామని గడికోట వారసులైన కామినేని అనిల్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయని పాఠశాల హెచ్‌ఎం సుజాత వారికి వివరించారు. దీంతో స్పందించిన అనిల్‌కుమార్ గడికోట ట్రస్టు ద్వారా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ట్రస్ట్ మేనేజర్ బాబ్జీకి సూచించారు.

'బాలికల ఆత్మరక్షణ' పోస్టర్ల ఆవిష్కరణ



భిక్కనూరు : మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో బాలికల ఆత్మరక్షణకు సంబంధించిన పోస్టర్లను కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, రామేశ్వర్‌పల్లి ఎంపీటీసీ సభ్యుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. వాంకడే కరాటే దు ఫెడరేషన్ ఆధ్వర్యంలో నాలుగేళ్లుగా ట్రైన్ ద ట్రైనర్స్ ప్రాజెక్ట్‌లో భాగంగా బాలికలకు ఉచితంగా సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నామన్నారు. వారిని ప్రోత్సహించేందుకు రూ. 5వేలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వాంకడే కరాటే ప్రతినిధులు ప్రియాంక, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు
- అధికారులు, ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలి
- ఆయా శాఖల పనితీరుపై అసహనం



పిట్లం సర్వసభ్య సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం(జుక్కల్): అధికారులు, ఉద్యోగులు ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. శనివారం పిట్లం మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ కవిత విజయ్ అధ్యక్షతన నిర్వహించారు. సర్వసభ్య సమావేశానికి మొదటిసారిగా హాజరైన ఎమ్మెల్యేను ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సమస్యలు, ప్రజలకు అందుతున్న సేవలు, సంక్షేమ పథకాలపై చర్చించారు. పలు శాఖల పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రజా ప్రతినిధులకు, అధికారులకు నిజమైన గుర్తింపు వస్తుందని అందరం ఆ దిశగా అడుగులు వేద్దామన్నారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. ఇతర గ్రామాలకు వెళ్లి చదువుకొనే విద్యార్థులకు స్కూల్‌కు వెళ్లడానికి ఇబ్బంది కలగకుండా బస్సు సౌకర్యం కల్పించాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని మండల విద్యాధికారికి సూచించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించిచారు. అంతకుముందు మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీకు చెందిన చిల్లర్గి సహకార సంఘం చైర్మన్ శప్థం రెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాంరెడ్డి, జంబిగే హన్మండ్లు, కృష్ణ రెడ్డి దొర, సాయిరెడ్డి, మోహన్‌రెడ్డి, బోడ్లరాజు, ఇబ్రోజ్, అద్నాన్ మహి, ఎంపీడీవో కమలాకర్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

బాన్సువాడ : ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికులకు బకాయి పడ్డా వేతనాలు వెంటనే చెల్లించాలని శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆస్పత్రి సుపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్‌కు కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుబాస్‌రాములు మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ కార్మికులకు సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 27 నుంచి పనులు బంద్ చేయనున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రేణుక, సురేఖ, రాజు, భారతి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

జీవదాన్ పాఠశాలలో ఫేర్‌వెల్ పార్టీ



ఎల్లారెడ్డి : పట్టణంలోని జీవదాన్ పాఠశాలలో శనివారం పదవ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ నిర్వహించారు. పాఠశాల్లోని 9వ తరగతి విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బాబు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి గ్రేడింగ్ సాధించాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడికి సన్మానం



కామారెడ్డి టౌన్ : హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో శనివారం జరిగిన రాష్ట్ర స్థాయి సమావేశంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇలియాస్‌ను రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. జాతీయ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి సురభి ద్వివేది, రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డిలు సన్మానించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ ఉన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీజేపీ నాయకులు

కామారెడ్డి టౌన్ : వచ్చేనెల 1వ తేదీన కామారెడ్డికి చేరుకోనున్న బీజేపీ విజయ సంకల్ప బస్సు యాత్ర కార్యక్రమ వాల్‌పోస్టర్లను శనివారం జిల్లా బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. కామారెడ్డి నియోజకవర్గంలో నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రను సక్సెస్ చేయాలని యాత్ర ప్రముఖ్ పొన్నాల వెంకట్ రెడ్డి కోరారు. నియోజకవర్గంలో మొదటి రోజు గర్గుల్ గ్రామం వద్ద యాత్ర ప్రారంభమై కామారెడ్డి జిల్లా కేంద్రంలో కొనసాగుతుందని తెలిపారు. రెండో రోజు పాల్వంచ, మాచారెడ్డి మండల కేంద్రం మీదుగా సిరిసిల్లకు బయలుదేరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపం



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లం గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి సంతాపంగా కొవ్వొత్తులు వెలిగించి సంతాపం తెలిపారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం ఎదుట చిత్రపటం ఎదుట కొవ్వొత్తులు వెలిగించి ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం ప్రతినిధులు, యువకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి శిశుమందిర్ వార్షికోత్సవం



కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో 40వ వార్షికోత్సవ వేడుకలను పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా నేషనలిస్ట్ హబ్ న్యూస్ చానల్ సీఈవో సాయి కృష్ణ హాజరయ్యారు. పాఠశాల అధ్యక్షుడు డాక్టర్ శ్యాంసుందర్, ప్రతినిధులు శంకర్, హరిస్మరణ్‌రెడ్డి, రాజిరెడ్డి, మల్లేశ్ యాదవ్, ప్రతాప్‌గౌడ్, రంజిత్‌మోహన్, ప్రిన్సిపాల్ నగేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు పంపిణీ



బాన్సువాడ : అవిజ్ఞ చారిటబుల్ పొండేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం విజయ్‌కుమార్ మాట్లాడుతూ అవిజ్ఞ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు పంపిణీ చేయడం హర్షనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సింధూ విద్యాలయం కరస్పాండెంట్ జ్ఞానేశ్వర్, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



మాచారెడ్డి : పాల్వంచ మండలం బండ రామేశ్వరపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మీన భర్త నాగరాజుతో పాటు పలువురు బీఆర్‌ఎస్ నేతలు శనివారం ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మాజీ ఉప సర్పంచ్ వినోద్ రెడ్డి, జీపీ కార్యదర్శి గంగ స్వామి పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అల్పాహారం కోసం నగదు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్ రెడ్డి దాతలకు కతజ్ఞతలు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

సమాచారం..

నేడు 'విశ్వకర్మ యోజన'పై అవగాహన

కామారెడ్డి అర్బన్ : పీఎం విశ్వకర్మ యోజన పథకంపై ఈనెల 24న ఆదివారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ మౌలాలి హెచ్‌బీ కాలనీ ఫస్ట్‌ఫేస్‌లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు బీజేపీ విశ్వకర్మసెల్ జిల్లా కన్వీనర్ సతీష్‌చారి తెలిపారు. అవగాహన సదస్సుకు 18 చేతి వృత్తులకులాల వారు హాజరుకావచ్చని, ఎంఎస్‌ఎంఈ అధికారులు విశ్వకర్మ యోజన పథకంపై సలహాలు, సూచనలు ఇస్తారని సతీష్‌చారి పేర్కొన్నారు.

ఉచిత హెల్త్ క్యాంప్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మిర్జాపూర్‌లో సోమవారం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఈసీ మెంబర్ మారుతి ఓ ప్రకటనలో తెలిపారు. 57 రకాల రోగాల నిర్ధారణకు పరీక్షలు చేస్తారని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఈ క్యాంప్ నిర్వహిస్తారన్నారు. ప్రతిఒక్కరూ ఆధార్‌కార్డు తేవాలన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి





నిజాంసాగర్‌లో అధికారులతో సమీక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్, తాడ్వాయిలోని ఎర్రాపహాడ్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : వేసవి ఎండలు ముందుతున్న నేపథ్యంలో గిరిజనతండాలు, గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మండల అధికారులు సూచించారు. శనివారం నిజాంసాగర్, జుక్కల్ మండల కేంద్రాల్లో పంచాయతీ కార్యదర్శులతో అధికారులు సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటికి మిషన్ భగీరథ జలాలు అందించాలని, నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు గంగాధర్, శ్రీనివాస్, ఎంపీవోలు అబ్బాగౌడ్, యాదగిరి జీపీ కార్యదర్శులు ఉన్నారు.

తాడ్వాయిలో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ జీపీలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్రమం తప్పకుండా మిషన్ బగీరథ ద్వారా నీళ్లను ట్యాంకుల్లో నింపాలన్నారు. ఇంటింటికీ తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీపీ కొడి రవి, ఎంపీటీసీ జలంధర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఏఈ వినోద్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.



నాగిరెడ్డిపేటలో..

పక్కాగా క్లోరినేషన్ చేయాలి..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : ఎండలు ముదురుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో పర్బన్న సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం వగ్రామాల జీపీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

కాటెల్‌దాంకు పాదయాత్ర



బాన్సువాడ : బీర్కూర్‌కు చెందిన పలువురు భక్తులు శనివారం మహారాష్ట్రలోని కాటెల్‌దాంకు పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు. మహాశివరాత్రి సందర్భంగా బీర్కూర్ తోట హనుమాన్ ఆలయం నుంచి మాదప్ప ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని బుల్దాన జిల్లా కాటెల్‌దాం గులాబ్ బాబా ఆశ్రమం వరకు పాదయాత్ర ఉంటుందని భక్తులు అన్నారు. పాదయాత్ర 13 రోజుల పాటు కొనసాగుతుందని, బీర్కూర్ నుంచి 30 మంది భక్తులు వెళ్లారు.

మొక్కలను సంరక్షించాలి



బాన్సువాడ రూరల్ : నర్సరీల్లో పెరుగుతున్న ప్రతి మొక్కను కాపాడాలని బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని ఇబ్రాహింపేట్, ఇబ్రాహింపేట్ తండా తదితర గ్రామాల్లో పర్యటించి నర్సరీలను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రతిరోజు నర్సరీలను పరిశీలించాలన్నారు. ఎంపీపీ నీరజారెడ్డి, ఎంపీవో సత్యనారాయణరెడ్డి, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం

వేంకటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో ఉన్న శ్రీ వెంకటేశ్వరాలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు భక్తి శ్రద్ధలతో భజన చేసుకుంటూ వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని ఆలయం ఆవరణలో చావడీశారు. హనుమాన్ స్వాములు, శివ స్వాములు, భక్తులు సిద్దిరాములు, గంగారాం, వెంకట్‌రెడ్డి, సిద్దారెడ్డి, సూర్యం, సంజీవులు, భిక్కన్‌రావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం



భిక్కనూరు : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వార్షికోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం అఖండ దీపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవాలను ప్రారంభించారు. 25వ తేదీ ఆదివారం కుంకుమార్చన, తీర్థప్రసాద వితరణ, అలంకరించిన ఎడ్ల బండ్లను అమ్మవారి ఆలయం చుట్టురా ఊరేగించారు. 26న సోమవారం అలంకరించిన బోనాలను గ్రామ దేవతల చుట్టూ తిరుగడం, 27వ తేదీ మంగళవారం రేణుకాదేవి ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణం, అన్నదానం, అలంకరించిన బోనాలను అమ్మవారికి సమర్పించడం, 28న బుధవారం బోనాలు తిరిగి గృహప్రవేశం కార్యక్రమాలను నిర్వహిస్నుట్లు గౌడ సంఘం ప్రతినిధులు తెలిపారు.

అయోధ్యలో తాడ్వాయి వాసులు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయికి చెందిన భక్తులు యూపీలోని అయోధ్య రాంమందిరానికి వెళ్లారు. అయోధ్య రామ్ మందిర్ దర్శన్ అభియాన్‌లో భాగంగా వెళ్లిన భక్తులు శనివారం అయోధ్యతో పాటు కాశీ విశ్వేశ్వరుడిని కూడా దర్శించుకున్నారు. భక్తులు శ్రీనివాస్, యాదగిరి, రాజిరెడ్డి, రాజు, రనీల్ రెడ్డి, వెంకట్‌రావు తదితరులున్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మహిళలు ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని అచల సిద్ధాంత తత్వ బోధకురాలు నారాయణమ్మ అన్నారు. శనివారం మండలంలోని లింగంపల్లి శ్రీ కృష్ణ మందిరంలో పవిత్ర మాఘ పౌర్ణమి సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలోని ప్రతి మహిళ ఇంట్లో పనులు చేసుకుంటూ నారాయణ నామం, శ్రీ కృష్ణ నామాన్ని జపించాలన్నారు. కార్యక్రమంలో పీఠాధిపతులు మచాలే బాబా, కన్హైరాజ్ బాబా, సారంగ్ బాబా తదితరులున్నారు.

వేంకటేశ్వరాలయంలో డీఎం పూజలు



కామారెడ్డి అర్బన్ : ఆర్టీసీ కామారెడ్డి డిపో మేనేజర్ ఇందిర, ఎంఎఫ్ వసుంధర శనివారం పట్టణ పరిధిలోని లింగాపూర్ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుని ద్వారా ఆలయ చరిత్ర, విశేషాలు తెలుసుకున్నారు. ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక వ్రతం



కామారెడ్డి అర్బన్ : పౌర్ణమి సందర్భంగా శనివారం కామారెడ్డి తూర్పు హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శారదమాత ఆదిశంకర ఆలయంలో నవదుర్గ సామూహిక వ్రతం నిర్వహించగా భక్తిశ్రద్ధలతో భారీ సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. అమ్మవారి పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. అన్నదానం చేశారు.

సాయిబాబా ఆలయం వద్ద అన్నదానం

రాజంపేట : రాజంపేట మండల కేంద్రంలో స్థానిక సాయిబాబా ఆలయం వద్ద శనివారం అన్నదానం చేశారు. పౌర్ణమి రోజును పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక పూజతో పాటు అన్నదానం చేశారు. అన్నదానానికి సహకరించిన మాజీ తాజా సర్పంచ్ ఆముద సౌమ్య నాగరాజు దంపతులకు సన్మానించారు.

సంక్షిప్తం

కొనసాగుతున్న చెరుకు క్రషింగ్

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీలో చెరుకు క్రషింగ్ కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 3లక్షల 11వేల 334మెట్రిక్ టన్నుల క్రషింగ్ జరిగినట్లు ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

రాజంపేట : మండలంలోని ఎల్లారెడ్డి పల్లి గ్రామంలో శనివారం సీసీ రోడ్డు పనులను స్థానిక నాయకులు ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు నిధులివ్వడంతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మండల యూత్ అధ్యక్షులు సల్మాన్, మండల నాయకులు ఎర్ర ప్రణీత్ రెడ్డి, మాజీ సర్పంచ్ బీరయ్య, ఎంపీటీసీ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్ గౌడ్, దాకాగౌడ్ ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలను స్వీకరించిన శ్రీహరిరాజును కాంగ్రెస్ నాయకులు శనివారం సన్మానించారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి ఎల్లారెడ్డికి బదిలీపై వచ్చిన శ్రీహరిరాజును కాంగ్రెస్ నాయకులు అజర్, సాయిబాబా శాలువాతో సన్మానించారు.

ఆరోగ్య సిబ్బందికి..

దోమకొండ : దోమకొండ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న సిబ్బందిని శనివారం సన్మానించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించి బదిలీ అయిన కేరోలిన్, సుమతిలను ఆస్పత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సన్మానించారు.

పాఠశాల తనిఖీ

రాజంపేట : రాజంపేట మండల ఆరెపల్లితండా, పెద్దాయిపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను శనివారం ఎంఈవో రామస్వామి, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఈశ్వర్ సందర్శించారు. ఆరెపల్లి తండా పాఠశాలలో హెచ్‌ఎం బాలాజి సెలవులో ఉండటంతో డిప్యూటేషన్‌పై సీఆర్పీ సాయిరెడ్డిని నియమించినట్లు ఎంఈఓ రామస్వామి తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

బాన్సువాడ రూరల్ : గర్భిణులు, బాలింతలు చిన్నారుల కోసం అంగన్‌వాడీ సెంటర్ల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని బాన్సువాడ ఎంపీపీ నీరజా వెంకట్రాంరెడ్డి అన్నారు. శనివారం ఆమె ఎంపీడీవో బషీరుద్దీన్, ఎంపీపీ సత్యనారాయణరెడ్డితో కలిసి మండలంలోని ఇబ్రాహింపేట్, ఇబ్రాహింపేట్ తండాల్లో పర్యటించారు.

జనగామను ఐలమ్మ జిల్లాగా ప్రకటించాలి

కామారెడ్డి అర్బన్ : జనగామ జిల్లాకు చాకలి ఐలమ్మ జిల్లాగా ప్రకటించాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర యూత్ కార్యదర్శి దేవరి నందు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో చాకలి సాధన సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ, ట్యాంక్ బండ్‌పై విగ్రహం ఏర్పాటుకు సీఎం కృషి చేయాలన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



మాచారెడ్డి : ఇటీవల మండలంలోని ఆయా గ్రామాల్లో పోగొట్టుకున్న 35 సెల్ ఫోన్లను రికవరీ చేసి శనివారం మాచారెడ్డి ఎస్సై శ్రీనివాస్ గౌడ్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సీఈఐఆర్ ద్వార ట్రేస్ చేసి సెల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేసినట్లు తెలిపారు.